


# సంబడం

-ఐతా చంద్రయ్య

బంగారంలాంటి కొత్తకోడలు - కోమలి బాధ చూస్తుంటే కోటయ్య మనసంతా కొంగలుదొక్కిన మడుగైపోతూంది. ఆందోళన పెరిగిపోతోంది.

నెలరోజుల ట్రైనింగ్‌కని నిన్న రాత్రి హైదరాబాదు వెళ్లిన కొడుకు ఈ రోజు ఉదయం ఏ.పి. ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బయలుదేరాడు. అతడింకా రైల్లోనే ఉన్నాడు.

కోటి కోర్కెలు కొంగున ముడేసుకుని కోడలిగా... రాబోయేముందే కోమలికి తెలుసు మామగారు వ్యాపారం చేస్తున్నారని, భర్త ఉద్యోగం చేస్తున్నాడని. మెడలో మూడు ముళ్లు పడి మూన్నాళ్లు కాలేదింకా. భర్తవెంట ఏడడుగులు నడిచి, సుభాష్ రోడ్‌లోని మూడంతస్తుల మేడలో అడుగుపెట్టింది. అత్తారింట్లో కుటుంబ సభ్యుల మనస్తత్వాలు అర్థమైపోతున్నాయి. పెళ్లయి అత్తవారింటికి వెళ్లిన ఆడపడుచు, హైదరాబాదులో ఎమ్మే చదువుతున్న మరిది, అమృతమూర్తి అత్తగారు .... అంతా బాగానే ఉన్నారు గానీ, మామగారి వ్యవహారమే... అరికాలి మంట నెత్తికెక్కిస్తుంది.

అవసరాన్ని ఆచితూచి, అంచనా వేసి, అంతవరకే వంటా వార్పూ చెయ్యాలంటాడు. అందరూ తినగా మిగిలిన అన్నం మరుసటి రోజు అవతల పారేస్తుంటే అగ్గిమీద గుగ్గిలమైపోతాడు.

"అన్నం పరబ్రహ్మ స్వరూపం. దాన్నలా పారేస్తుంటే అన్నపూర్ణకు కోపమొస్తుంది. ఇంట్లోంచి వెళ్లిపోతుంది. అప్పుడు మనమంతా మనిషికో చిప్ప పట్టుకుని అడుక్కుతినాలి!" అని కేకలేస్తాడు.

ఇంట్లో నేలమీద ఎక్కడన్నా బియ్యం గింజ కనిపిస్తే చాలు స్వయంగా, సగౌరవంగా దాన్ని లేవనెత్తి బియ్యం డబ్బాలో వేస్తాడు. వంటింట్లో రెండు పోపుగింజలు గాని, నాలుగు ఉప్పురవ్వలు గాని నేలమీద కనిపిస్తే చాలు, ముల్లోకాలూ తలకిందులైపోయినట్టు ఒకటికి నాలుగుసార్లు గొణుక్కుంటాడు.

పల్లెటూరి రైతులవద్ద కిలో, అరకిలో నెయ్యి కొని డబ్బాల్లో నింపేస్తాడు. ఆ డబ్బాల నెయ్యిని హైదరాబాదు తీసుకెళ్లి మంచి లాభానికమ్మేస్తాడు. ఇల్లంతా నెయ్యి ఘుమఘుమలు బాగానే ఉంది. అతని లేకితనమే పరువును పంచనామా చేసిపారేస్తుంది.

ఓరోజు వంటింట్లో నెయ్యి వెచ్చబెట్టేముందు అందులో పొరపాటున నాలుగైదు కందిపప్పు గింజలు పడినాయి. వెంటనే ఆ పప్పుగింజల్ని ప్రాణాలతో బయటకు తీశాడు. వాటికంటుకున్న నెయ్యిని అత్యంత జాగ్రత్తగా విడదీసి పప్పు డబ్బాలో వేశాడు.

'అబ్బా! ఇంత పిసినారితనమా!' బుర్రలో భూగోళం గిర్రున తిరిగింది కోమలికి.

"మావయ్య అంత ఇదిగా ప్రవర్తిస్తారెందుకత్తయ్యా?" అడిగింది సీతమ్మను అసహ్యాన్నంతా అదిమిపెట్టి.

"ఎంత ఇదిగా ప్రవర్తిస్తున్నారమ్మా?"

"ఆ నాలుగైదు పప్పుగింజల విలువెంతా?" లోపల కుతకుతలాడిపోతోంది.

"ఓస్.... అదా!" చిన్నగా నవ్వింది. రూపాయి కాసంత కుంకుమబొట్టు తళుక్కుమంది. "చిట్టెడు చిట్టెడే పుట్టెడవుతాయి కదా!" కొట్టిపారేసింది.

"గంతకు దగ్గ బొంత!" అనుకుని ఊరుకుంది.

భర్త ఆఫీసునుండి వచ్చాక ఆ సంగతి చెప్పేసింది.

ఆ మహానుభావుడు కిమ్మనడే! ఎంతైనా కన్నతండ్రి కదా!

అతనికేం, మహారాజు! ఢిల్లీకి దర్జాగా వెళ్లాడు.

కొడుకు వచ్చేదాకా కోడల్ని చాలా జాగ్రత్తగా చూసుకోవాలని నిర్ణయించుకుంది సీతమ్మ.

పొద్దున్న నిద్ర లేస్తూనే, "కడుపులో నొప్పిగా ఉంది అత్తయ్యా!" అంది కోమలి మొహం కడుక్కుంటూ.

"పైత్యం చేసిందేమో....!" అంది తను.

కొంచెంసేపయ్యాక "అమ్మ! మాయదారి కడుపునొప్పి ..... ఎక్కువైందత్తయ్యా!" బాధపడుతూ చెప్పింది.

సీతమ్మ హడలిపోయింది.

"ఏమండీ! కోడలికి కడుపునొప్పి. బాధపడుతోందండీ" భర్తతో చెప్పేసింది. కోటయ్య వెంటనే డాక్టర్ని పిలిపించి చూపించాడు. డాక్టరు రాసిచ్చిన మందులు తెచ్చి ఇచ్చాడు.

గంటసేపయ్యాక మళ్లీ గిలగిల్లాడిపోతోంది.

"అమ్మో..... హమ్మో..... నొప్పి ..... అబ్బో.....!" మెలికలు తిరిగిపోతోంది. పై ప్రాణాలు పైననే ఎగిరిపోతున్నట్టనిపించింది సీతమ్మకి.

ఆ బాధ తనకే కలుగుతున్నట్టుంది కోటయ్యకు.

"ఇహ లాభంలేదు. నర్సింగ్ హోమ్ కెళ్లాల్సిందే!" అన్నాడు. ఆఘమేఘాలమీద ఆటో పిలిపించాడు. శివాజీనగర్‌దాకా తీసుకెళ్లాడు. పట్నంలో పేరున్న రోహిణీ నర్సింగ్‌హోమ్‌లో చేర్పించాడు.

పాలరాయి పరిచిన నర్సింగ్‌హోమ్ శుచీ శుభ్రతకు మారుపేరులాగా ఉంది. నర్సుల చిరునవ్వుల పలకరింపు రోగాన్ని మాయం చేసేలాగుంది.

ఎక్స్‌రే, బ్లడ్ టెస్ట్, ఇ.సి.జి., యూరిన్ టెస్ట్ పూర్తి చేశారు. స్కానింగ్ చేసి చూశారు. పదేళ్లుగా ప్రాక్టీసు చేస్తున్న స్పెషలిస్టు డాక్టరుకు ఎందులోనూ, ఏ లోపమూ కనిపించలేదు.

"ఎందుకైనా మంచిది, హైదరాబాదు నిమ్స్‌కు తీసుకెళ్లి చూపించండి!" అని ఉత్తరం రాసిచ్చాడు.

టాక్సీ కారు తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నాడు కోటయ్య.

... ఇప్పటికే వేలల్లో ఖర్చయింది. హైదరాబాదు వెళ్తే మరికొన్ని వేల ఖర్చు ... కోమలి మనసు చివుక్కుమంది.

"అత్తయ్యా!" ఆదోలా పిలిచింది.

"ఎలా ఉందమ్మా?" గుడ్లనీరు గుడ్లల్లో కుక్కుకుంటోంది సీతమ్మ.

"ఇప్పుడు నొప్పి లేదత్తయ్యా! ఇంటికెళ్దాం!"

ఆశ్చర్యంగా కాసేపు నోటమాట రాలేదు సీతమ్మకు. ఆ తర్వాత భర్తతో చెప్పింది. మంచం వద్దకు పరుగెత్తుకువచ్చాడు కోటయ్య.

"డబ్బు ఖర్చవుతుందని అలా అంటున్నావు కదమ్మా?"

"క్కా..... క్కాదు, మావయ్యా! నొప్పి లేదు!"

"చూడమ్మా...!" కోడలికి నచ్చచెప్పాలనుకున్నాడు.

"మనిషి డబ్బు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. నిజమే, కానీ సంపాదించేటప్పుడు పిసినారిగా ఉండాలి, ఖర్చు చేసేటప్పుడు ఉదారంగా ఉండాలి. మనిషి డబ్బును సంపాదిస్తాడు గానీ, డబ్బు మనిషిని సంపాదించదు. నువ్వేమీ ఇది గావద్దు. హైదరాబాదు వెళ్దాం!"

"ప్లీజ్, మావయ్యా!" లేచి కూర్చుంది. "ఇంటికెళ్దాం. దయచేసి నా మాట వినండి, మావయ్యా!" బతిమాలింది.

ఆటోలో ఇంటికొచ్చారు. ఎవ్వరి సహాయం లేకుండా ఆటో దిగి లోపలకొచ్చింది కోమలి. ఇప్పటిదాకా మెడకోసిన కోడిలా గిలగిల్లాడిన కోడలు, లేడిపిల్లలా గంతులేస్తూ లోపలికొచ్చిందే! .... పెద్దవాళ్లు మొహాలు చూసుకున్నారు.

"నన్ను క్షమించండి, మావయ్యా!" కోటయ్య పాదాలు స్పృశించింది కోమలి. అత్తగారికి పాదాభివందనం చేసింది.

"ఇదేమిటే ... పాత తెలుగు సినిమాలాగా ఎందుకీ పాదాభివందనాలు?" భార్యనడిగాడు కోటయ్య.

"నాక్కూడా తెలియదండీ!" బుగ్గలు నొక్కుకుందామె.

కోమలి గుండె చెరువైపోయింది. "మామగారి గుండె బండరాయనుకున్నాను...." పాప భీతి ఒళ్లంతా పాకిపోతోంది. "నాకేదన్నా రోగమొస్తే మామగారేం చేస్తారోనని ... చి.... చిన్న.... నాటకమాడాను. న్నా.... నాకసలు నొప్పే లేదు!" కళ్లు ఊటచెలమలైపోయాయి.

"మరైతే పరీక్షలో నేను పాసయ్యానా కోడలా?" నవ్వాలో, బాధపడాలో అర్థంగాక చూపులు అర్ధాంగివైపు మళ్లించాడు కోటయ్య.

"బాగానే ఉంది సంబడం!" చేతులూ, మూతులూ తిప్పి ముక్కుమీద వేలేసుకుంది సీతమ్మ.

■



## ఆరోగ్యానికి ధ్యానం, చిరునవ్వు

ధ్యానంపై మన పూర్వీకులు ఎన్నో విషయాలు చెప్పారు. ఢిల్లీలో ఒక ఆరోగ్య సదస్సును ప్రారంభించిన అందాలనటి శ్రీదేవి (ఆమె త్వరలో తిరిగి వెండితెరపై కనిపించి కనువిందు చేయనున్నారు) ధ్యానం గురించి కొన్ని విషయాలు చెప్పారు. చిత్తగించండి!

"శరీరం ఆరోగ్యంగా ఉండడానికి ధ్యానం చక్కగా ఉపకరిస్తుంది. అంతేకాదు, ఇది మనసును ఆహ్లాదంగా ఉంచి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. ధ్యానం జీవితంలోని పలు దశలలో మనకు ప్రాణస్నేహితురాలు. ధ్యానంతోపాటు ఎప్పుడూ మొహం మీద చిరునవ్వు మాయనీయకుండా వుండగలిగితే మనం ఆరోగ్యవంతులమైనట్టే లెక్క!" అంటే ఇంతకాలమూ ధ్యానం గురించి బాగా అధ్యయనం చేశారన్నమాటేగా!

సి.